క్లుప్తంగా

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ మనశ్శాంతి తదితరులు

చాగల్లు: పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్‌ని వాడకాన్ని అందరూ నిషేధించాలని ఈఓ పీఆర్‌డీ శ్రావణ్ కుమార్ పిలుపు నిచ్చారు. గురువారం చాగల్లు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్లాస్టిక్ నిర్మూలన, స్వచ్ఛ సంకల్పం అనే విషయంపై వ్యాపార సంస్థల యాజమానులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకంతో మనం చేసే తప్పు భావితరాలకు పెనుముప్పు అవుతుందన్నారు. సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, పంచాయతీ కార్యదర్శి ఎల్.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాసరావు

గోపాలపురం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతం పెంచాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపైనా ఉందని మండల విద్యాశాఖ అధికారి జి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో గురువారం హెచ్ఎంలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలలకు విద్యార్థులు తరలకుండా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని, ప్రభుత్వం ప్రకటించిన మెనూ చార్ట్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు ఎకడమిక్ స్టాండర్డ్ మెరుగుపరచాలని, డయేరియా నీటి కాలుష్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎ.మహేశ్వరరావు, హెచ్ఎంలు కూరం నారాయణరావు, ఎస్‌సీహెచ్ రత్నకుమారి, బోడా వెంకటలక్ష్మి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుస్తులు, పండ్లు పంపిణీ

కొవ్వూరు: సమాజానికి అందించే సేవలు స్ఫూర్తినిస్తాయని కొవ్వూరు మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నాకుమారి, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు అన్నారు. అంధుల సేవా ట్రస్ట్, స్వామి వివేకానంద బుద్ధ ఫౌండేషన్, గౌతమి పిరమిడ్ జ్ఞాన వేదిక, అనపర్తి గోపాల కృష్ణ కళాపరిషత్‌ల వార్షికోత్సవ కార్యక్రమం గురువారం నిర్వహించారు. స్థానిక అనపర్తి గోపాల కృష్ణ ఇంటి వద్ద జరిగిన కార్యక్రమంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. దొమ్మేరులోని ఆదరణ అంధుల సేవాశ్రమంలోని అంధులకు దుస్తులు, పండ్లు అందజేశారు. ఈ కర్యాక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నాకుమారి, మాజీ మ్మెల్యే టీవీ రామారావులు, నాయకులు సూరపనేని చిన్ని, కంఠమణి రామకృష్ణ, మద్దుల సత్యనారాయణ, అక్కాబత్తుల జాన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన స్నేహ



చాగల్లు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి బొల్లా స్నేహ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.వీర్రాజు తెలిపారు. స్నేహ తల్లిదండ్రులు వల్ల నాగరాజు, వరలక్ష్మి తోపుడు బండిపై రేగిపండ్లు, మామిడి తాండ్ర అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంటారు. నిరుపేద కుటుంబానికి చెందని విద్యార్థిని ఐఐటీకి ఎంపిక కావడంపై ఉపాధ్యాయులు ఎం.సోమరాజు, పాఠశాల సిబ్బంది విద్యా కమిటీ చైర్మన్ ముద్రగడ కాశీ భగవాన్, పేరెంట్స్ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు అభినందించారు.

రైతు బజార్‌లో రాయితీపై బియ్యం, కంది పప్పు



రైతు బజార్లో రాయితీపై బియ్యం అందజేస్తున్న ఎమ్మెల్యే

తాళ్లపూడి: ప్రజలకు మంచి పాలన అందజేయడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరులోని రైతు బజార్‌లో గురువారం రాయితీపై బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు బజార్ల ద్వారా ఇటు రైతులకు, అటు వినియోగదారులకు దళారి వ్యవస్థ లేకుండా మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అశుతోష్ శ్రీవాస్తవ, ఎస్టేట్ ఆఫీసర్ సీహెచ్ సత్యనారాయణ, తహసీల్దార్ మస్తాన్, నాయకులు కంఠమణి రామకృష్ణ, సూరపనేని చిన్ని, పెనుమాక జయరాజు, మట్టే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్కరికే 'వందనం'

- తల్లికి వందనంపై మాట మార్చిన ప్రభుత్వం
- బడులు తెరిచి నెల రోజులు దాటినా జమ కాని సొమ్ము
- అసహనం వ్యక్తం చేస్తున్న తల్లులు
- గత ప్రభుత్వంలో సమయానికి అందిన అమ్మఒడి
- గోపాలపురం యోజకవర్గంలో 1.09 లక్షల మందికి రూ.165.01 కోట్లు



గతంలో దేవరపల్లిలో అమ్మఒడి చెక్కును అందజేస్తున్న మాజీ మంత్రి తానేటి వనిత, మాజీ ఎంపీ భరత్‌రామ్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, అప్పటి కలెక్టర్ మాధవీలత(ఫైల్)

దేవరపల్లి: అధికారంలోకి వచ్చాక తల్లికి వందనం పథకం అమలు చేస్తాం.. స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15వేల ఆర్థిక సాయమందిస్తాం.. ఇంటిలో ఎంత మంది పిల్లలు చదువుకుంటే అంత మందికి జమ చేస్తాం.. మనస్సు ఉంటే మార్గం ఉంటుంది. డబ్బులు లేకపోతే సంపదను సృష్టించి ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తాం.. ఇవీ సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు చెప్పిన మాటలు. ఆయన సీఎం అయ్యారు. నెల పాలనా కాలం పూర్తికావొచ్చింది. సంక్షేమ పథకాలు అమలు సమయం ఆసన్నమైంది. ఒక్కసారిగా సీఎం చంద్రబాబు మాటల్లో తడబాటు కనిపిస్తోంది. అధికారంలోకి రావడం కోసం నోటికి వచ్చిన హామీలన్నీ ఆకర్షణీయంగా గుప్పించిన ఆయన ఎన్నికల తర్వాత వాటిని పక్కకు నెట్టే మాటలు మాట్లాడుతున్నారు. ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లికి వందనం ఇస్తామని చెప్పి ఇప్పుడు ఒక్కరికి మాత్రమే పరిమితం చేశారు. ఈ సాయాన్ని ఒక్కో తల్లికి రూ.15వేలకు పరిమితం చేయడంతో అసహం వ్యక్తం చేస్తున్నారు.

అసలు మాట మరచి..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇంటిలో ఎంత మంది పిల్లలు చదివితే అంత మందికి తల్లికి వందనం పేరుతో ఒక్కో విద్యార్థికి రూ. 15 వేలు తల్లులకు అందజేస్తామని ఎన్నికల్లో కూటమి నేతలు ప్రకటించారు. దీంతో ప్రజలు ఆశపడి కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారు. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీల్లో తడబాటు కనిపిస్తోంది. ఎంత మంది పిల్లలుంటే అంత మందికి తల్లికి వందనం ఇస్తామన్న బాబు ఆ మాటే ఎత్తడం లేదు. అసలు మాట మరచి తల్లి ఖాతాలో జమ చేస్తామని చెబుతున్నాయి. అయితే ఇంత వరకూ కనీసం ఒక్కపిల్లాడికి కూడా సొమ్ము ఇవ్వలేదని విద్యార్థులు తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం ఒత్తిడి ఎక్కువగా ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెప్పింది చెప్పినట్టు చేసిన గత ప్రభుత్వం

మాజీ సీఎం వైఎస్ జగన్ తన హయాంలో విద్య, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యతనిస్తూ పాలన సాగించారు. చిన్నారుల బంగారు భవిష్యత్తు కోసం విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొవచ్చారు. పిల్లలు ఉన్నతంగా ఎదగాలని ఆలోచన చేసి అమ్మ ఒడి పథకాలన్ని అమలు చేశారు. 2019లో ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2020–21 విద్యా సంవత్సరం నుంచి పిల్లలను బడికి పంపిస్తున్న తల్లుల ఖాతాల్లో ఏటా రూ.15 వేల చొప్పున జమ చేశారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ అమ్మఒడి సాయం క్రమం తప్పకుండా అందించారు. విద్యా పథకాల అమలుపై క్యాలెండర్‌ను విడుదల చేసి చెప్పింది చెప్పినట్టు సాయాన్ని అందజేశారు. గత నాలుగు సంవత్సరాలుగా అమ్మఒడి పథకం ద్వారా వేలాది మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో నాలుగు విడతలుగా 1,09,340 మంది తల్లులకు రూ.165 కోట్లు ప్రభుత్వం జమ చేసింది. నాలుగో విడతగా 2023 సంవత్సరానికి 27,497 మంది తల్లుల ఖాతాలకు రూ.42.27 కోట్లు ప్రభుత్వం జమచేసంది. దేవరపల్లి మండలంలో 7340 మంది తల్లుల ఖాతాలకు రూ.11.01 కోట్లు, ద్వారకాతిరుమల మండలంలో 6921 మంది తల్లుల ఖాతాలకు రూ.10.38 కోట్లు, గోపాలపురం మండలంలో 5826 మంది తల్లుల ఖాతాలకు రూ.8.73 కోట్లు, నల్లజర్ల మండలంలో 7410 మంది తల్లుల ఖాతాలకు రూ.11.15 కోట్లు జమ చేసింది. నాలుగు విడతలుగా ప్రభుత్వం తల్లులఖాతాలకు జమచేసి జగనన్న అమ్మఒడి నిధులు, తల్లుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

గత ఏడాది వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమ్మ ఒడి పథకం లబ్ధిదారులు, ఇచ్చిన నిధులు

దేవరపల్లిలో మండలంలో..

విద్యా సంవత్సరం	తల్లుల వివరాలు	జమ చేసిన సొమ్ము (రూ. కోట్లలో)
2020	27075	40.61
2021	26380	39.57
2022	28388	42.56
2023	27497	42.27

నిడదవోలు మండలంలో...

విద్యా సంవత్సరం	విద్యార్థులు వివరాలు	జమ చేసిన సొమ్ము (రూ. కోట్లలో)
2019–20	9524	రూ.14.29 కోట్లు
2020–21	9480	రూ.14.22 కోట్లు
2021–22	9405	రూ.14.11 కోట్లు
2022–23	9,343	రూ.14.01 కోట్లు

పిల్లల ఫీజులు చెల్లించాలి



మాకు ఇద్దరు అమ్మాయిలు. వాళ్లని తాళ్లపూడిలోని ఓ ప్రైవేట్ స్కూల్లో చదివిస్తున్నాం. గత ప్రభుత్వంలో ఏటా అమ్మ ఒడి సొమ్ములు బ్యాంక్ ఖాతాలో నేరుగా వేశారు. నాలుగు సార్లు అమఒడి తీసుకున్నాం. వాటితో పిల్లలకు ఫీజులు చెల్లించే వాళ్లం ఇప్పుడు ప్రభుత్వం మారింది. ఇప్పటి వరకు తల్లికి వందనం పథకం పై క్లారిటీ ఇవ్వలేదు. ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు.

–పిట్టా ఆనంద కుమారి, విద్యార్థి తల్లి, అన్నదేవరపేట, తాళ్లపూడి

పిల్లలందరికీ వర్తింపజేయాలి



ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామిని నెరవేర్చాలి. తల్లికి వందనం పథకాన్ని అందరి పిల్లలకు వర్తింపజేయాలి. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి పథకాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అన్న మాట ప్రకారం తప్పకుండా అమలు చేయాలి.

– కోడి. వనితరాణి, నిడదవోలు టౌన్

కూటమి నేతలు ఇచ్చిన హామీని నెరవేర్చాలి



ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీని నెరవేర్చాలి. తల్లికి వందనం పేరున ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మంది పిల్లలకు పథకం ద్వారా నగదు ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. దీంతో పిల్లల తల్లిదండ్రులు హామీలను నమ్మి ఓట్లు వేశారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం ఇంట్లో ఒకరికి మాత్రమే తల్లికు వందనం ఇస్తామనడం దారుణం. ఇచ్చిన హామీ మేరకు హామీని అమలు చేయాలి.

–వి.మణమ్మ, నిడదవోలు టౌన్

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

నల్లజర్ల: నల్లజర్ల గ్రామంలో విద్యుత్ లైన్లు మార్పిడి, చెట్లు కొమ్మలు తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వీరభద్రరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

దేవరపల్లి: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు డీఈఈ బి.వీరభద్రరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల క్రింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

పెరవలి మండలంలో...

పెరవలి: వార్షిక మరమ్మతుల కారణంగా కానూరు, పెరవలి విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ డీఈ బి.వీరభద్రరావు తెలిపారు. కానూరు సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ కోత ఉంటుందన్నారు. పెరవలి సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. మల్లేశ్వరం పీడర్‌పై ఉన్న గ్రామాలైన అన్నవరప్పాడు, పిట్టల వేమవరం, మల్లేశ్వరం, ఖండవల్లి గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

నిడదవోలు రూరల్: మండలంలోని కోరుమామిడి, అమ్మేపల్లి, సింగవరం, సమిశ్రగూడెం, అట్లపాడు గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పనుందని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వీరభద్రరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉపాధ్యాయుల అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేయాలి

ఉండ్రాజవరం: ఉపాధ్యాయులకు అకడమిక్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.జయకర్ కోరారు. ఆగస్టులో కాకినాడలో నిర్వహించే యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం మండలంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా చివటం పాఠశాలలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు నేటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తమ ప్రభుత్వం రాగానే జీవో 117 రద్దు చేస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సీబీఎస్ఈ పరీక్ష విధానం రెండు వేరు వేరు పద్ధతులలో ఉండడంతో విద్యార్థులలో గందరగోళం ఏర్పడుతుందన్నారు. ఈ విధానాన్ని రద్దు చేసి అన్ని రాష్ట్రాలల్లోనూ ఒకే విధంగా నిర్వహించాలన్నారు. గత ప్రభుత్వంలో అందించిన అమ్మఒడి, నేటి ప్రభుత్వం హామీ ఇచ్చిన తల్లికి వందనం పథకాలు కేవలం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పరిమితం చేస్తే డ్రాప్ అవుట్స్ తగ్గి, అడ్మిషన్లు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు కుంకట్ల వెంకటరత్నం, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ ఐ.రాంబాబు, మండల గౌరవ అధ్యక్షుడు ఎస్.లక్ష్మినారాయణ, కార్యదర్శి బి.రామారావు, మహిళా అధ్యక్షురాలు ఎం.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి వనిత



సమావేశంలో మాట్లాడుతున్న హోంశాఖ మాజీ మంత్రి తానేటి వనిత

నల్లజర్ల: అధైర్య పడవద్దు అండగా ఉంటానని వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులకు ఆ పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత హామీ ఇచ్చారు. అచ్చన్నపాలెంలో కాకర్ల గంగరాజు కల్యాణ మండపంలో గురువారం సాయంత్రం మండలశాఖ అధ్యక్షుడు గగ్గర శ్రీనివాస్ అధ్యక్షతన ఎన్నికలలో ఓటమిపై సమీక్ష, కార్యకర్తల సమావేశంలో వనిత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరికి ఎప్పుడు, ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు వచ్చినా అందరం ఐక్యతతో ఎదుర్కొందామన్నారు. అందరూ ఇచ్చిన స్ఫూర్తితోనే తన కూడా ధైర్యంగా తిరగలుగుతున్నానని, మీఆదరాభిమానాలకు ఎప్పుడు రుణపడి ఉంటానన్నారు. కౌంటింగ్ అనంతరం జరిగిన దాడులలో గాయపడ్డ వారిని త్వరలో స్వయంగా కలుసుకుంటానన్నారు. పార్టీ ఓటమికి కారణాలు చాలా ఉన్నాయన్నారు. అన్నిస్థాయిలలో తప్పిదాలు జరిగాయన్నారు. వాటిని సరిదిద్దుకొని 2029 ఎన్నికలకు విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని సూచించారు. గోగులమండ రాజారావు, బోడిగడ్ల రాజారావు, తొమ్మండ్రు రమేష్, సతీష్ తమ, తమ అభిప్రాయాలను సమావేశంలో వెల్లడించారు. తొలుత ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ కనికెళ్ల విల్సన్ మృతికి సమావేశం శ్రద్ధాంజలి ఘటించింది. కార్యక్రమంలో కారుమంచి రమేష్, బంక అప్పారావు, అచ్యుతశివాజీ, ముప్పిడివెంకటరత్నం, పల్లిజ్యోతి, మేణ్ణి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మనుషుల అక్రమ రవాణాను అరికడదాం



కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ సిబ్బంది, ప్రజ్వల సంస్థ ప్రతినిధులు

రాజానగరం: మనుషుల అక్రమ రవాణాను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ టి.నాగమణి అన్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మనుషుల అక్రమ రవాణాపై గురువారం స్థానిక ప్రాజెక్టు కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అక్రమ రవాణాకు గురయ్యే వారిలో అత్యధికులు అమ్మాయిలేనన్నారు. ఉద్యోగం, సినిమా అవకాశాలు తదితర వాటిని ఎరగా చూపి అమ్మాయిలను విదేశాలకు విక్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై మహిళలు చైతన్యవంతురాలు కావాలన్నారు. సంస్థకో ఆర్డినేటర్ శ్రావ్య శృతి మాట్లాడుతూ డాక్టర్ సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో మనుషుల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా తమ సంస్థ 28 ఏళ్లుగా పోరాటం చేస్తోందన్నారు. ఐసీడీఎస్, పోలీస్, విద్య న్యాయ శాఖల సహకారంతో ఇప్పటి వరకు 28,200 మంది మహిళలను కాపాడి, వారికి పునరావాసం కల్పించామన్నారు. ప్రతి గ్రామంలో కమ్యూనిటీ విజిలెంట్ గ్రూపులను ఏర్పాటు చేయడం ద్వారా అందరు అప్రమత్తంగా ఉంటారన్నారు.

నిడదవోలు అభివృద్ధికి ప్రాధాన్యం

- అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలు వెంటనే పరిష్కరించాలి
- మండల సర్వసభ్య సమావేశంలో మంత్రి దుర్గేష్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు రూరల్: నిడదవోలు నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యమిస్తానని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సమిశ్రగూడెంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సాధారణ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన వినతులు పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు రాకుండా పారిశుధ్యం మెరుగుకు కృషి చేయాలన్నారు. ఉపాధిహామీ నిధులతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు విద్యాశాఖ పనిచేయాలని సూచించారు. తాడిమళ్ల సర్పంచ్ బయ్యే రాధారాణి మాట్లాడుతూ రోడ్డు మార్జిన్లలో ఆక్రమణలను తొలగించాలని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. తాళ్లపాలెం సర్పంచ్ యర్రా రామకృష్ణ మాట్లాడుతూ తాళ్లపాలెం, శెట్టిపేట రెవెన్యూ గ్రామాలుగా గుర్తించాలని, ఎర్రకాలువ ప్రభావంతో పంటలు నష్టపోతున్నామని ఏటిగట్టు గండ్లు పూడ్చాలని కోరారు. కాలువల్లో గుర్రపుడెక్క తొలగించాలని మంత్రి దుర్గేష్ జలవనరుల శాఖాధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో నిధుల లభ్యతను బట్టి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. అనంతరం వివిధ శాఖల అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, వైస్ ఎంపీపీలు కానుబోయిన ప్రభావతి, వడల రత్నకుమారి, ఎంపీడీఓ జేఏ ఝాన్సీ, కార్యాలయ ఏఓ రత్నరాజు, తహసీల్దార్ నాగ భూషణం, హౌసింగ్ డీఈ ఎస్.చంద్రశేఖర్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

కోలాహలంగా ఆర్యాపురం బ్యాంక్ నామినేషన్లు



నామినేషన్ దాఖలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: ది ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ పాలక వర్గ ఎన్నికలకు గురువారం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 20వ తేదీన జరగనున్న ఎన్నికలకు పలువురు తమ నామినేషన్లను ఎన్నికల అధికారి కృష్ణకాంత్‌కు అందజేశారు. వైఎస్సార్ సీపీ బలపరిచిన బ్యాంక్ పాలకవర్గ చైర్మన్ అభ్యర్థిగా నందెపు శ్రీనివాస్, ఇతర డైరెక్టర్ల పదవులకు సభ్యులతో కలసి నామినేషన్ పత్రాలను అందజేశారు. నందెపు శ్రీనివాస్, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ మాట్లాడుతూ గతంలో పాలకవర్గంగా పనిచేసిన చల్లా శంకర్రావు ఆర్యాపురం కోఆపరేటివ్ బ్యాంకును భ్రష్టు పట్టించారని, అన్ని విధాలుగా అవినీతిమయం చేశారన్నారు. తమ ప్యానల్‌ను గెలిపించడం ద్వారా ఆర్యాపురం బ్యాంకు ప్రతిష్ఠను, ప్రయోజనాలను కాపాడేందుకు ఖాతాదారులు సహకరించాలని కోరారు. ఈ నెల 20వ తేదీన ఎస్‌కేవీటీ స్కూల్లో జరిగే ఎన్నికల్లో ఖాతాదారులందరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. వీరి బెల్ట్‌లో డైరెక్టర్లుగా పులవర్తి లక్ష్మణస్వామి, దూడల త్రినాథ్, నండూరి సుబ్బారావు, డాక్టర్ లంక సత్యనారాయణ, నందం కుమార్ రాజా, కస్సె రాజేష్, ఆకుల శ్రీనివాస్ ఉన్నారు. సీపీఐ నుంచి కూండ్రపు రాంబాబు, కాంగ్రెస్ నుంచి కొవ్వూరి శ్రీనివాస్‌కు అవకాశం కల్పించారు. కార్యక్రమంలో జాంపేట బ్యాంకు చైర్మన్ బొమ్మన జయకుమార్, వాకచర్ల కృష్ణ, మజ్జి అప్పారావు, వడ్డి మురళీ, మజ్జి నూకరత్నం, ఒంటిద్దు సూరిబాబు తదితరులు ఉన్నారు.

అధిక జనాభాతో అనర్థాలు



తాళ్లపూడిలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది



ఉండ్రాజవరంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

చాగల్లు: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా బ్రాహ్మణగూడెంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జనాభా నియంత్రణపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ దేవీ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ తల్లి, బిడ్డ శ్రేయస్సు కోసం సరైన సమయంలో గర్భదారణ, బిడ్డకు, బిడ్డకు మధ్య అంతరం ఉండాలన్నారు. అధిక జనాభా వల్ల కుటుంబ ఆర్థికంగా ఇబ్బందులు పడుతుందనిన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి జనాభా నియంత్రణపై మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ పద్మ, సారమ్మ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ

తాళ్లపూడి: జనాభా నియంత్రణపై అందరికీ అవగాహన ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ పి.భాగ్యలక్ష్మి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా తాళ్లపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గురువారం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పీహెచ్‌సీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ పి.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ చిన్న కుటుంబం చింతలు లేని కుటుంబం అని అన్నారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బాల్య వివాహాలు వద్దని, బాల్య వివాహాలు వలన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ప్రజలు సహకరించి బాల్య వివాహాలు జరగకుండా చూడాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.



పెరవలిలో ర్యాలీ చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

ఉండ్రాజవరం: జనాభా నియంత్రణలో ప్రజలందరూ భాగస్వాములుకావాలని ఉండ్రాజవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఆర్ఎస్ఎస్‌వీ ప్రసాద్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఉండ్రాజవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుటుంబ నియంత్రణపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ ఆర్థికంగా ఎదగడానికి చిన్న కుటుంబం తోడ్పడుతుందన్నారు. పీహెచ్‌సీ డాక్టర్ ఆర్.ఉషాదేవి మాట్లాడుతూ తల్లి, బిడ్డ శ్రేయస్సు కోసం సరైన సమయంలో గర్భధారణ, బిడ్డకు బిడ్డకు మధ్య అంతరం ఉండాలన్నారు. అనంతరం పీహెచ్‌సీ సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.సుబ్రహ్మణ్యం, సూపర్‌వైజర్లు శ్రీనివాసరావు, సుభాషిణి, పబ్లిక్ హెల్త్ నర్స్ కె.కుమారి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెరవలి: కుటుంబ ప్రణాళిక అనేది భారతదేశానికి కొత్త గుర్తింపు తెచ్చిందని అందుకే ప్రపంచంలో యువత కలిగిన దేశంగా ఉందని పీహెచ్‌పీ వైద్యాధికారిణి ఎ.కృష్ణవేణి తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా పెరవలి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ రమణమూర్తి, సూపర్ వైజర్స్ రాజేష్, అత్తిలి రాణి, యేసురాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు పీటీఎస్ఎఫ్ కృషి

రాజమహేంద్రవరం సిటీ: అందరూ చదవాలి.. అందరూ ఎదగాలి అనే ధ్యేయంతో విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పేరెంట్స్ టీచర్స్ అండ్ స్టూడెంట్స్ యునైటిడ్ ఫెడరేషన్ (పీటీఎస్ఎఫ్) కృషి చేస్తుందని ఆ సంస్థ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కొల్లపు వేణు (రాజా) తెలిపారు. కంబాల చెరువు హైటెక్ బస్టాండ్ ఎదురుగా ఉన్న శ్యామలా బిల్డింగ్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అట్టడుగు వర్గాలకు విద్య అందితేనే అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయన్నారు. పేరెంట్స్, టీచర్స్, విద్యార్థులలో ఎవరికి ఏ సమస్య వచ్చినా తాము అందుబాటులో ఉండి పరిష్కారిస్తామన్నారు. ఈ సందర్భంగా బ్రోచర్‌ను ఆవిష్కరించారు. బద్దే జార్జి ఆంటోనీ, నక్కా వెంకటరత్నం రాజు, దారా ఏసురత్నం, కోరుకొండ చిరంజీవి, తాళ్లూరి బాబూ రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.